క్లుప్తంగా

యాగశాల నిర్మాణం పూర్తి

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించేందుకు వీలుగా ఆలయం సమీపంలో యాగశాలను నిర్మించారు. పనులను వైఖానస ఆగమ పండితులు దీవి పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

సాయి చాలీసా పారాయణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామికి విశేష అర్చనలు జరిగాయి. పురోహితులు నరసింహామూర్తి, అజయ్‌కుమార్‌లు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పరావస్తు హనుమాన్ సూరి ఆధ్వర్యంలో సాయిచాలీసా, గీతాభజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మికుల సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యత అని యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు వంద రోజులకుపైగా దీక్షలు చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, మంగళగిరి ఎమ్మెల్యే లోకేష్ గానీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఇక్కడ పర్యటించినపుడు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, డి.మాణిక్యరావు, సుభాని, వై.సుబ్బారావు, రమాదేవి, ఇమాంబి, సారమ్మ, రిబ్కా, మల్లేశ్వరి, దీనమ్మ, మోహనరావు, ఇస్రాయిల్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



దుగ్గిరాల: ప్రజా చైతన్య యాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పారావు తెలిపారు. దుగ్గిరాల మండల కేంద్రం చెన్నకేశవనగర్‌లో శుక్రవారం యాత్రం చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. కనీసం డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం పలువురు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ .. ప్రయాణికులు సురక్షితం

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతినగా.. ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడిన ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం విజయవాడ నుంచి గుంటూరు వైపు జాతీయ రహదారిపై వెళ్తుండగా రెండు కార్లు అదుపుతప్పి ఢీకొన్నాయి. వాటిల్లోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సహకారంతో ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కార్లను రోడ్డుపై నుంచి తొలగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైతన్య మహాప్రభువు ఆవిర్భావ దినోత్సవం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో శుక్రవారం ఇస్కాన్ దేవాలయంలో శ్రీ చైతన్య మహాప్రభువు ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ రాధా శ్యామ్‌సుందర్ మందిరంలో మంగళహారతులు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన సేవ్యభగవాన్ దాస్ ఇచ్చిన దివ్య ప్రవచనం ఆకట్టుకుంది. మందిర అధ్యక్షులు చక్రధారి దాసు మాట్లాడుతూ ప్రభువు చైతన్య బోధనలు నేటి ప్రపంచానికి ఆచరణాత్మకంగా ఉన్నాయన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

స్వామి వెడలె.. మంగళాద్రి మురిసె..

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



కుండలతో కుంభం తెస్తున్న భక్తులు

శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్య రథోత్సవంతో శుక్రవారం మంగళాద్రి మురిసింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలుత అర్చక స్వాములు ఉత్సవ మూర్తులను అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. నమో నారసింహా... అంటూ నినదించిన భక్తజనంతో నగర వీధులు కిక్కిరిశాయి. ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఉత్సవాన్ని ప్రారంభించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– మంగళగిరి/మంగళగిరి టౌన్



పూల అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు



రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు



నృత్యం చేస్తున్న కళాకారులు



రథోత్సవానికి సిద్ధమైన చప్టాల బృందం

ఆకట్టుకున్న నృత్యాలు

మంగళాద్రి తిరునాళ్లలో కళాకారులు నృత్యాలు, కోలాటం, ఆటపాటలు, డప్పులు, మేళతాళాలు, తప్పెట్లు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవానికి ముందు ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలతో భక్తులు పరవశించారు. చప్టాల బృందం ఉత్సాహంగా పాల్గొంది. అంతకు ముందు స్వామి, అమ్మవార్లను అర్చకులు శాస్త్రోక్తంగా రథంపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు.

ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి టౌన్: నృసింహుని దివ్య రథోత్సవం సందర్భంగా ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మందులు, ప్రథమ చికిత్స అందించినట్లు డాక్టర్ అనూష తెలిపారు.



మందులు అందిస్తున్న డాక్టర్ అనూష

భక్తులకు మజ్జిగ పంపిణీ

మంగళగిరి: మంగళాద్రి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం స్వామి వారి దివ్య రథోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో పలువురు దాతలు, సంస్థలు అల్పాహారం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశాయి. మెయిన్‌బజార్ ఆర్యవైశ్య సంఘం తదితర సంస్థలు ఈ కార్యక్రమాలు చేపట్టాయి. పంపిణీని పట్టణ సీఐ వినోద్ కుమార్, ఆలయ ఈవో ఎ. రామకోటిరెడ్డి తదితరులు ప్రారంభించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

తప్పుడు కేసులు ఎదుర్కోవడానికి సిద్ధం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కష్టం వస్తే అండగా ఉంటాం
- కక్షపూరిత రాజకీయాలు ఎంతోకాలం సాగవు
- ప్రజల పక్షాన పోరాటానికి అందరూ సిద్ధం కావాలి
- మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వేమారెడ్డి



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న తప్పుడు కేసులను ఎదుర్కోవడానికి పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న శ్రేణులను ఆదుకుంటామని తెలిపారు. ప్రశ్నించిన ప్రజలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు అందరం సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పార్టీ వారిపై కొంతమంది అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బెదిరింపు రాజకీయాలు ఎంతోకాలం పనిచేయమని, అలాంటి వారు శాశ్వతంగా రాజకీయాలకు దూరం అవుతారని అన్నారు. వారి గురించి మనం ఆలోచించాల్సిన అవసరం లేదని తెలిపారు. భవిష్యత్తులో వాడవాడలా వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కమిటీలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడ ఏం జరిగినా వెంటనే సంబంధిత నాయకులు న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ప్రశ్నించే ప్రజలపై, నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ఉండవల్లి పార్టీ అధ్యక్షుడు దంటు గోవర్ధనరెడ్డి, మున్నంగి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కళ్ళం రాజశేఖరరెడ్డి, మేకా హనుమంత ప్రసాద్ యాదవ్, సిగిరిశెట్టి శ్రీకాంత్, ఉండవల్లి అశ్విని మాస్టర్, సంకురు సుకుమార్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అధినాయకత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈమని, మోరంపూడి, పేరకలపూడి గ్రామాలలో శుక్రవారం పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీ నాయకులపై అనేక అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని పార్టీ అధిష్టానం ధీటుగా ఎదుర్కోవటంతోపాటు ఇబ్బందులు పడే నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య, నాయకులు, కారకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని శిరంగిపాలెం , యర్రగుంట్లపాడు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అండగా నిలిచారని చెప్పారు. పేద విద్యార్థికి కనీసం ఫీజు కూడా చెల్లించని పరిస్థితి నేడు నెలకొందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పాలపాటి రఘు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, మస్తాన్‌రావు, కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, యోహుషువా, పెద్దిరెడ్డి, గోవిందరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటరెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- సొంత గనులను కేటాయించాలి
- కార్మిక సంఘాల డిమాండ్



లాడ్జి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ నాయకుడు బి.ముత్యాలరావు అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కేంద్రాన్ని అడగకుండా, ఇంకా ప్రారంభం కాని మిట్టల్ ప్రైవేటు ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించాలని కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్ల రూపాయలు నిధులు ఇచ్చినప్పటికీ అవి కేవలం అప్పులు తీర్చటానికే ఉపయోగించాలని షరతులు పెట్టిందంటే, అప్పులు లేకుండా చేసిన తరువాత ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కూరపాటి కోటయ్య, ఏఐకెయంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గనిరాజు, ఏఐటీయూసీ నాయకులు బుజ్జి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఏఐవైఎఫ్ నాయకులు జంగాల చైతన్య ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, వై.రమణ, సీహెచ్ శ్రీనివాసరావు, షేక్ ఖాశీం వలి, షేక్ ఖాశీం షహీద్, జి.శంకరరావు, ఆర్. రాజేశ్వరరావు, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సీఎస్ఈ హానర్స్ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లి మండల పరిధిలోని చిర్రావూరు గ్రామంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. కేఎల్‌యూ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. యూనిట్ విద్యుత్ పొదుపు చేస్తే ఉత్పత్తి కంటే గొప్పదని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సౌర విద్యుత్తు ఉపయోగాలు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను, ఫీల్డ్ కోఆర్డినేటర్ పి. సురేష్‌ను వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ ఆదిత్యన్ తదితరులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణపై..

తాడేపల్లి రూరల్: గుండిమెడ గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కేఎల్‌యూ విద్యార్థులు మొక్కలు నాటారు. సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్ మాట్లాడుతూ జీవ వైవిధ్యం మెరుగు, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత పెంచడం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, మైదాన ప్రాంతాల్లో మొక్కలు నాటామని తెలిపారు. స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ కో ఆర్డినేటర్‌లు పి.వి. సత్యనారాయణ, టి. శివకృష్ణ పర్యవేక్షించారు.

చినకాకాని నుంచి గుణదలకు పాదయాత్ర



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఆర్‌సీఎం చర్చి నుంచి గుణదల చర్చి వరకు పాస్టర్లు, క్రైస్తవ సోదరులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. సుమారు 600 మంది పాలుపంచుకున్నారు. పాస్టర్ అల్లం చిన్నపరెడ్డి, విచారణ గురువులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

మేడికొండూరు: మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పేరేచర్ల గ్రామానికి చెందిన దేవరకొండ రామారావు శుక్రవారం 8వ తరగతి చదువుతున్న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఈ విషయం గురించి తల్లిదండ్రులకు చెప్పింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో బాధితురాలి తల్లిదండ్రులు మేడికొండూరు పోలీసులను ఆశ్రయించారు. జరిగిన విషయంపై ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దేవరకొండ రామారావుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు.

వేధింపులతో భార్య ఆత్మహత్య

పట్నంబజారు: భర్త వేధింపులతో భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. పాతగుంటూరులోని ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంతంలో నివాసం ఉండే రాచకొండ భానుప్రియ(37)కు రవికుమార్‌తో 11 ఏళ్ల కిందట వివాహం అయింది. రైల్వే స్టేషన్‌లో కూలిగా పనిచేసే రవికుమార్ నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను వేధింపులకు గురిచేస్తుండాడు. ఈనెల 13న భానుప్రియను కొట్టడంతోపాటు, వేధింపులకు గురిచేశాడు. భర్త రవికుమార్ వేధింపులతో భానుప్రియ ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

పరిమళించిన మానవత్వం

అనాథ శవాన్ని మార్చురీకి తరలించిన సేవా సమితి సభ్యులు



మృతదేహాన్ని మార్చురీకి తరలిస్తున్న సభ్యులు

తెనాలిఅర్బన్: అనాథ శవాన్ని తెనాలిలోని శ్రీశివ లింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితి సభ్యులు జిల్లా వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. ఈ సంఘటన తెనాలిలో శుక్రవారం జరిగింది. వివరాలలోకి వెళ్తే.. నెల్లూరుకు చెందిన విశ్రాంత పురావస్తు శాఖ ఉద్యోగి నూతలపాటి సుబ్రమణ్యం (74) తెనాలి నాజరుపేటలో అద్దెకు నివశిస్తున్నాడు. ఆయన కొద్దిరోజుల నుంచి ఇంటిలో నుంచి బయటకు రాలేదు. ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విషయం తెలుసుకున్న ఎస్సై వై.సుబ్బయ్య అక్కడికి వచ్చి ఇంటిని పరిశీలించగా సుబ్రమణ్యం బాత్రూంలో విగతజీవిగా పడి ఉన్నాడు. అతడికి ఎవరు లేరని తెలియటంతో శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు ఎస్సై ఫోన్ చేసి మార్చురీకి శవాన్ని తరలించాలని కోరారు. దీంతో సమితి సభ్యులు కుర్రా శ్రీను, అక్కల రమేష్, పోతురాజు, శివప్రసాద్‌లు దానిని జిల్లా వైద్యశాలలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించి మానవత్వం చాటారు.

నేడు ఆరుంబాక నెల్లెమ్మ తిరునాళ్ల

చెరుకుపల్లి: మండలంలోని ఆరుంబాక గ్రామంలో వేంచేసి యున్న నెల్లెమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఆలయ ప్రాంగణంలో కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆరుంబాక గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పలు విద్యుత్ ప్రభలు, డప్పు వాయిద్యాలతో విన్యాసాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, కావున భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కృపా కటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో ముగ్గురు తల్లులైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలైన అమ్మవార్లను భక్తులు దర్శించారు. వేద బ్రాహ్మణులు క్రోవి రామకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

ఘనంగా అమ్మవార్ల జయంతి

తెనాలి: స్థానిక కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో అమ్మవార్ల 27వ జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీదండిస్వామి మఠానుబంధమైన ఈ ఆలయంలో శ్రీదండిస్వాముల దివ్యాశీస్సులతో ఈ వేడుకను తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ప్రారంభించారు. మహాభిషేకంతో మొదలుపెట్టి, ఉదయం 8 గంటలకు ఆరగింపు సేవ, హారతి, 11 గంటలకు సహస్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. సాయంత్రం గజవాహనంపై అష్టలక్ష్మి అమ్మవార్ల ఊరేగింపు పురవీధుల్లో భారీగా జరిగింది. మంగళవాయిద్యాలు, మహిళల కోలాటంతో జగవాహనంపై ఊరేగింపుకు ముందుగా కుమార్ పంప్స్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, కృష్ణకుమార్, హరికుమార్‌లు నడిచారు. ఆలయ పూజారి శ్రీరామ్ చక్రవర్తి పూజావిధులను నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు ఎన్జీవో కల్యాణ మంటపంలో ఊంజల సేవ జరిగింది. సంబూరులోని కాశీ వనాశ్రమ పీఠాధిపతి శ్రీచంద్రకాళీప్రసాద్ మాతాజీ, పెదపులిపాక శ్రీ విజయ రాజరాజేశ్వరి విద్యాపీఠాధిపతులు వాసుదేవానందగిరి స్వామి, బళ్లారి శ్రీగురు గీత మందిరాధిపతులు నిత్యానంద భారతి స్వామి ప్రవచనం చేశారు.